1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఫిబ్రవరి 15, 2025 | www.navatelangana.com

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-నార్నూర్



బోయిలి కాసా గిరిజనులకు ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కోలాం గిరిజనులు అభివృద్ధిలో చాలా వెనక బడి ఉన్నారని పొలంలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అంతకుముందు పది మంది రైతులు కట్టిన డీడీలను ఇచ్చారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని వైకుంఠపూర్ గ్రామంలోని పురాతన ప్రభు స్వామి శివాలయం పునర్నిర్మాణ మందిరంలో విగ్రహాలు మల్లికార్జున స్వామి, లక్ష్మీనరసింహ స్వామి, సంతాన లక్ష్మీదేవి, హనుమాన్ సహిత నవగ్రహాలు ధ్వజస్థంభం, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు శుక్రవారం ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు, ప్రధాన అర్చకులు ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమం శని, ఆది, సోమవారాల్లో వేద పండితులు శ్రావణ్ కుమార్, రాజు, ప్రవీణ్ శర్మచే విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మహా అన్నదానం ఉంటుందన్నారు.

అక్రమ రవాణపై ఉక్కు పాదం

- ఇటీవల పట్టుబడిన 208క్వింటాళ్ల రేషన్ బియ్యం
- రాష్ట్రస్థాయిలోనూ చర్చనీయాంశంగా మారిన వ్యవహారం
- లోతుగా విచారణ చేపడుతున్న పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్‌శాఖలు
- పలువురు అనుమానితులు అదుపులోకి తీసుకొని విచారణ

జిల్లాలోరేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కొన్నేండ్ల నుంచి రహస్యంగా సాగుతున్న ఈ దందాపై అధికారులు దృష్టిసారించారు.తాజాగా రెండు రోజుల క్రితం ఏకంగా 208క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడటం సర్వత్రా కలకలం రేపింది. ఈ వ్యవహారం ఇటు జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంలోనూ సంచలనం రేకెత్తించింది. ఓ ఆడియో లీకైన వ్యవహారం రాష్ట్రంలో కలకలం సృష్టించడం చర్చనీయాంశమైంది. దీంతో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. అక్రమార్కుల భరతం పట్టేందుకు పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసుశాఖలు ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈ అక్రమ బియంపై లోతైన విచారణ చేపడుతున్నారు. ఇందులో ఎంతటి వారున్నా విడిచిపెట్టేదిలేదని స్పష్టం చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.





నవతెలంగాణ-దహెగాం/సిర్పూర్(టి)

సిర్పూర్ మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పెద్ద ఎత్తున పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. అయితే ఎస్పీ డీవీ.శ్రీనివాస్ దీన్ని సీరియస్‌గా తీసుకోవడంతో ఇటు పోలీసులు అటూ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సూత్రదారులను పట్టుకునేంఉదకు లోతైన విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకేసారి మూడు ఐచర్ వ్యాన్లలో 208 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడడంతో పాటు అక్రమార్కులు వివిధ శాఖల అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు మాట్లాడుకున్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా అధికారులు సంఘటనపై సీరియస్ అయ్యారు. దీంతో అక్రమార్కుల భరతం పట్టేందుకు పౌరసరఫరాల ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి పోలీసు శాఖల అధికారులు పూర్తిస్థాయిలో విచారణను వేగవంతం చేశారు. శుక్రవారం నియోజకవర్గంలోని దహెగాం మండలంలోని పలు గ్రామాలతో పాటు మంచిర్యాల జిల్లాలోని కన్నెపల్లి, నెన్నెలా మండలాల నుండి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారని అనుమానంతో సుమారు ఏడుగురు వ్యక్తులను సిర్పూర్-టీ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిసింది. వీరితో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి..ఎవరెవరు ఎక్కడి నుండి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారని విషయాలను తెలుసుకుంటున్నట్లు సమాచారం. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణలో పలువురు ప్రయివేట్ వ్యక్తులతో పాటు రేషన్ డీలర్లకు సైతం సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు గొప్పమంటున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లా అధికార యంత్రాంగం గట్టిగానే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.



విచారణ కొనసాగుతోంది..

ఈ విషయమై సిర్పూర్-టి ఎస్సైనీ వివరణ కోరగా బియ్యం అక్రమ రవాణా కేసు విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఇందులో భాగంగా వివిధ మండలాలకు చెందిన ఏడుగురు వ్యక్తులను పిలిపించి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మరింత మంది పేర్లు కూడా వినిపిస్తుండడంతో వారి కూడా శనివారం విచారణకు హాజరు కావాలని పోలీసులు చెప్పినట్టు సమాచారం. పీడీఎస్ బియ్యంపై పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దూకుడుకు అక్రమార్కుల్లో భయం మొదలైందని చెప్పవచ్చు. ఇది ఇలానే కొనసాగుందో లేదో వేచిచూడాలి.

ఘనంగా ఎడ్‌బిడ్ మల్లన్న దేవుని జాతర

- కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్ల యోధులు
- భారీగా తరలివచ్చిన జనం



నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలోని మల్లన్న దేవుని జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. నిర్మల్ జిల్లా నుంచి కాకుండా ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మహారాష్ట్ర నుంచి సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లన్న దేవుని దర్శించుకున్నారు. ఈ జాతర సందర్భంగా సుమారు 20 వేలకు పైగా భక్తులు తరలివచ్చి మల్లన్న దేవుని దర్శించుకున్నారు. ఆలయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. జాతరలో ప్రత్యేక ఆకర్షణగా రంగులరాట్నాలు నిలిచాయి. జాతరకు వచ్చిన భక్తుల్లో చిన్నాపెద్దా అనే తేడా లేకుండా రంగుల రాట్నాలపై కూర్చున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు, గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కుస్తీపోటీలకు తరలివచ్చిన మల్లయోధులు

జాతరలో భాగంగా శుక్రవారం ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయలతో జాతరలో కుస్తీపోటీలు నిర్వహించారు. తెలంగాణ నుండే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పోటీలో పాల్గొన్నారు. ఈ కుస్తీపోటీలు మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగాయి. వీటిని తిలకించేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు. కుస్తీపోటీల్లో పాల్గొన్నవారికి భోజన వసతితో పాటు పారితోషకాన్ని అందించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చిన భక్తులకు నిర్వహకులు సుమారు 22 క్వింటాళ్ల బియ్యంతో అన్నదానం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించి, భక్తులకు మందులను అందజేశారు. ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు చేపట్టారు. జాతరకు భైంసా నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిచాయి. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, సాయంరెడ్డి, విఠల్‌రెడ్డి, భూమన్న, రవీందర్‌రెడ్డి, నిమ్మ పోతన్న, గురుప్రసాద్ యాదవ్, రాములు, మానిక్‌రెడ్డి, లక్ష్మన్, ఉదయ్, మల్లేష్, సుదర్శన్, విఠల్ యాదవ్, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్గీకరణ నివేదికపై అభ్యంతరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణపై ఏకసభ్య కమిటీ ప్రతినిధిగా డాక్టర్ శమీమ్ అక్తర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై తమకు అభ్యంతరాలున్నాయని మాల, మాల ఉపకులాలు, బుద్దిస్ట్, మహర్ సంఘాల ఉమ్మడి ప్రతినిధి, భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర నాయకులు రత్నాజాడే ప్రజ్ఞాకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మాదిగలను 1, 2, 3 కేటిగిరీలుగా విభజించి, రిజర్వేషన్లు అమలు చేయాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను ఆక్షేపించారు. అంతకు ముందు పట్టణంలో అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ ప్రతులను దహనం చేశారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛాయుత జీవనం సాగించేలా రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. కానీ స్వార్థప్రయోజనాల కోసం కొంతమంది రాజ్యాంగాన్ని తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కుమ్మక్కైన మంద కృష్ణ మాదిగ దొడ్డిదారిన వర్గీకరణను ఆమోదించుకోవడాన్ని ఎండగట్టారు. 2025 జనాభా ప్రకారం ఎస్సీ కులగణన చేసి మాలజాతి జనాభాను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల, మాల ఉపకులాల సంఘ ప్రతినిధులు మేకల మల్లన్న, కొప్పుల రమేష్, దయాశీల, పుష్ప, విఠల్ భుక్తే, వాగ్మారే కాంతారావు, దయానంద్ కాంబ్లె, నీలాబాయి, కవిత, శాంతాబాయి పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో ఆర్‌ఓల పాత్ర కీలకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల ప్రక్రియ, విధుల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు-2025 రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు ప్రాజెక్టర్ ద్వారా ఎన్నికల నిర్వహణ, విధులు, ఫాం పూరించే విధానంతో పాటు ఏజెంట్ల నియామకం, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఆర్ఓ, ఏఆర్ఓలు శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో స్టేజ్ వన్, స్టేజ్ టూ అధికారుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి శిక్షణలు పూర్తి చేసుకొని నిర్వహణకు అంత సిద్ధంగా ఉండాలన్నారు. ఆర్డీఓ, ఏఆర్ఓతో పాటు నోడల్ అధికారులకు ఒక వాట్స్ ఆప్ గ్రూప్‌ను తయారు చేసి అందులో మాస్టర్ ట్రైనర్లను యాడ్ చేయాలన్నారు. ఎలాంటి సందేహం ఉన్న వెంటనే నివృత్తి చేస్తారన్నారు. ఆర్ఓ, ఏఆర్ఓలు మ్యానువల్‌ను క్షుణ్ణంగా చదివి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, జెడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి, డీఎల్‌పీఓ, ఆర్ఓలు, ఏఆర్ఓలు పాల్గొన్నారు.

అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్థానిక సంస్థలు ఎన్నికలు రానున్న సందర్భంగా ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు నియమితులైన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అధికారులు సమన్వయంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ఎన్నికలకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులుగా నియమించబడిన వారికి కేటాయించడం మండలాలలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ, ప్రతి అంశంపై అవగాహన





కలిగి ఉండాలని, అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా, గుర్తుల కేటాయింపు, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైందన్నారు. పొరపాట్లకు, వివాదాలకు తావు లేకుండా నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో శిక్షణలో ఇచ్చే ప్రతి అంశాన్ని తప్పకుండా ఆచరించాలని తెలిపారు. ఎన్నికలను భాగంగా ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఫారాలు, కవర్లు, పోలింగ్ సామాగ్రి అవసరమైన మేరకు పోలింగ్ రోజున అందుబాటులో ఉంచాలని,రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ క్రమంలో అందిస్తున్న శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ, ఏఆర్ఓ, మాస్టర్ ట్రైనర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్ అన్నారు. ఈనెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్‌లను శుక్రవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయం భగత్ సింగ్ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు పూర్తయినా ఇప్పటివరకు, ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇండ్లు లేని పేదలందరికీ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. రేషన్ కార్డు లేని పేద ప్రజలందరికీ వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రైతు రుణమాఫీ రెండు లక్షల వరకు చేస్తామని, మాఫీ చేయడంలో విఫలమయ్యారన్నారు. రైతు భరోసా పథకాన్ని రూ.15వేల నుంచి రూ.12 వేలకు కుదించి అవి ఇవ్వడంలో విఫలమవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీల అమలుకై ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి జే.రాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకటనారాయణ, ఎం.హరిత, సునారికారి రాజేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగారి వెంకటేష్, నాయకులు లింగన్న, స్వామి, గుట్ల ప్రసాద్, మాన్క శ్రీనివాస్, సత్తన్న, రాములు పాల్గొన్నారు.

పైలెట్ ప్రజావాణి స్టేట్ టీమ్‌తో కలెక్టర్ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పైలెట్ ప్రజావాణి, ప్రజా ఫిర్యాదుల బహిరంగ విచారణ కార్యక్రమంపై స్టేట్ టీమ్‌తో కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో మొదటగా జిల్లాలో జనవరి 27 నుంచి ప్రారంభించిన ఇన్ఫర్మేషన్ ఫెసిలిటీ సెంటర్ ద్వారా ప్రజావాణి కార్యక్రమం మండలంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరణలో రెవిన్యూ, ఉపాధి హామీ, పెన్షన్, రేషన్ కార్డులు, తాగునీరు, విద్యుత్ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయా మండలాల్లో కార్యాలయ పనివేళల్లో అర్జీలను సమర్పణ కార్యక్రమంలో స్టేట్ టీమ్ రాజస్థాన్, జార్ఖండ్, బెంగుళూర్, హైదారాబాద్, యాదద్రి భువనగిరి, వికారాబాద్, భువనగిరి, తదితర ప్రాంతాల నుంచి కిసాన్ మిత్ర, సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ, డిజిటల్ ఎంపవర్ ఫౌండేషన్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, రైతు స్వరాజ్ వేదిక, సఫర్ ఇతర పౌర సమాజ సంస్థల నుంచి 60 మందికి పైగా పౌర సమాజ వాలంటీర్లు ఆదిలాబాద్‌కు వచ్చి జిల్లా పరిపాలనతో సహకరించడం జరిగిందన్నారు. పబ్లిక్ హియరింగ్ లు 9 రోజుల వ్యవధిలో షెడ్యూల్ రూపొందించి, ప్రతి పబ్లిక్ హియరింగ్‌లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా సజావుగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. మూడువారాల స్వల్పవ్యవధిలో పైలట్ జిల్లా పరిపాలన, పౌర సమాజ సంస్థలకు వారి ఫిర్యాదులను నమోదు చేయడంలో ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రజల ఫిర్యాదులను సకాలంలో నమోదు చేయడానికి పరిష్కరించడానికి, పరిపాలనా యంత్రాంగం ఎంతో సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. మండల స్థాయి పబ్లిక్ హియరింగ్‌కు ప్రజలు ఎంతో ఆసక్తితో హాజరవడం హర్షణీయమని, తమకెంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని, ప్రతిచోటా ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని, స్టేట్ టీమ్ కలెక్టర్‌కు వివరించారు. మండల స్థాయి ప్రజావాణిలో ముఖ్యంగా ప్రజాపాలన దరఖాస్తులు గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి, జీరో విద్యుత్ బిల్, రుణమాఫీ సమస్యలు, అటవీ హక్కుల సమస్యలు, రేషన్ పెన్షన్ డిలీట్ సమస్యలుపై మండల స్థాయిలో దరఖాస్తుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి కొన్ని అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందనీ తెలిపారు. దాదాపు 90 జీఆర్ఓలు ఈ ప్రక్రియలో నిమగ్నమై, విచారణకు ముందు ఫిర్యాదులను విచారించామన్నారు. విచారణలో ఫిర్యాదుదారుకు మధ్యంతర, తుది ప్రతిస్పందనను అందించడం తదనంతరం నమోదిత ఫిర్యాదులపై 30 రోజులలోపు రాతపూర్వక చర్య తీసుకున్న నివేదికను అందించడం వంటి విధానాలపై దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మిత్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ హర్ష, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

శుద్ధమైన తాగునీరు అందించాలి



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్ షిప్‌లో నివసిస్తున్న సింగరేణి కార్మిక కుటుంబాలకు శుద్ధమైన తాగునీరు అందించడంతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హెచ్ఎంఎస్ నాయకులు కోరారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ పత్యం రాజబాబు, బ్రాంచ్ సెక్రటరీ ఎం.శివారెడ్డి మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో ప్రతిరోజు కార్మిక కుటుంబాలకు గోలేటి ఫిల్టర్ బెడ్ నుండి సరఫరా చేస్తున్న నీరు తాగే విధంగా లేవన్నారు. ఫిల్టర్ బెడ్‌లో నీళ్ల సరిగా శుద్ధి చేయకపోవడంతో మురుగునీరు కార్మిక కాలనీలకు సరఫరా చేయడంతో కార్మికులకు చర్మవ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఫిల్టర్ బెడ్ నుండి వచ్చిన నీళ్ల వాటర్ ట్యాంకులలో నిల్వ చేస్తే నల్లగా పేరుకుపోయి వడేందుకు ఉపయోగించే పరిస్థితి లేదన్నారు. అదేవిధంగా సింగరేణి కార్మిక కుటుంబాలకు తెల్లని దుస్తులు నల్లగా మారుతున్నాయని జీఎం దృష్టికి తీసుకువచ్చారు. గెలిచిన యూనియన్ ఏఐటీయూసీ నాయకులు జీఎం కమిటీలో మాట్లాడుతున్నమని చెబుతున్నారని, కానీ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా పరిష్కారం కావడం లేదన్నారు. యాజమాన్యం కార్మికులకు తాగడానికి నీటిని శుద్ధి చేసే యంత్రాలను ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి సింగరేణి కార్మిక కుటుంబాలకు శుద్ధమైన నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఆర్గనైజర్ ఎస్‌ఏ, ఈనూస్, టెక్నీషియన్ ఆర్గనైజర్ కల్లూరి రాజు పాల్గొన్నారు.

గాంధీభవన్ సమావేశానికి వెళ్లిన నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

గాంధీ భవన్ హైదరాబాద్‌లో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లారు. ఇక్కడ స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పార్టీ అధినేతలు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. దీనికి మండలం నుంచి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, రెబ్బెన టౌన్ అధ్యక్షుడు, బీసీ సంఘం నాయకులు వనమాల మురళీ, ఎమ్మార్పీఎస్ నాయకులు గోగర్ల రాజేష్, మునూరుకాపు నాయకులు మిట్ట దేవేందర్, మాలీ సంఘం నాయకులు సోన్లే సంతోష్ ఉన్నారు.

18న బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సబ్-జూనియర్ జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉష్కం రఘుపతి, రాష్ట్రపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 20 నుంచి 23 వరకు వికారాబాద్ జిల్లాలోని 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు 01-04-2009 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. అబ్బాయిలు, అమ్మాయిలు 55 కేజీలు బరువు ఉండి ఆధార్ కార్డు, పాఠశాల బోనఫైడ్, రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు విఠల్‌రెడ్డి, సుకుమార్‌కు మధ్యాహ్నం 1 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 7702035200 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎస్పీని కలిసిన బాధిత కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఖానాపూర్ పట్టణంలో సంచలనం సృష్టించిన అలేఖ్య హత్య కేసులో నిందితులందరికీ శిక్ష పడేలా చూడాలని, బాధిత కుటుంబ సభ్యులు ఎస్పీ జానకి షర్మిలను శుక్రవారం కలిశారు. ప్రధాన నిందితుడు శ్రీకాంత్‌కు జీవిత ఖైదు శిక్ష పడిందని, హత్యకు కారకులైన ఏ2, ఏ3 నిందితులకు ఎలాంటి శిక్ష వేయకుండా వదిలేశారని, వారికి కూడా సరైన శిక్ష విధిస్తేనే తమ కుటుంబానికి సరైనా న్యాయం జరుగుతుందని అన్నారు. వారి వల్ల తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని ఎస్పీతో బాధిత కుటుంబం పేర్కొన్నారు. వెంటనే ఎస్పీ స్పందించి, ఈ కేసు విషయంలో హైకోర్టులో అప్పీల్ చేస్తామని తెలిపారు.



మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- ఐకేపీ ఎంపీఎం సుజాత

నవతెలంగాణ-బేల

మహిళలందరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐకేపీ ఎపీఎం సుజాత మహిళలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మావతి మండల సమైక్య సమావేశ మందిరంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఎం సుజాత మాట్లాడుతూ సేర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక స్వలంబనతో పాటు మహిళ సంఘాల సభ్యలకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలు పెరిగే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు శరత్‌రెడ్డి, ప్రమోద్, దేవానంద్, లక్ష్మి, మహిళ సమైఖ్య అధ్యక్షురాలు మంజూష, కార్యదర్శి భీంభాయి, వీఓఏలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కోళ్లకు వ్యాధి సోకితే వెటర్నరీ డాక్టర్లను సంప్రదించాలి



నవతెలంగాణ-కడెం

పౌల్ట్రీ ఫామ్స్‌లలో కోళ్లకు ఏదైనా వింత వ్యాధులు సోకితే వెంటనే వెటర్నరీ అధికారులకు లేద సిబ్బందికి సమాచారం అందించాలని మండల వెటర్నరీ వైద్యురాలు డాక్టర్ సౌందర్య అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని పాండ్వాపూర్, అంబారిపేట్ గ్రామాలలో 4 పౌల్ట్రీ ఫామ్స్‌ను సందర్శించి, ఆయ ఫారాలలో పెంచుతున్న కోళ్లను పరిశీలించారు. పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బర్డ్‌ఫ్లూ వ్యాధి ముందస్తు జాగ్రత్తలలో భాగంగా కోళ్ల ఫారాలలో కోళ్లను పరిశీలించి, ఫామ్ యజమానులకు కోళ్లకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించి, పలు జాగ్రత్తలపై సూచనలు చేశారని వారన్నారు. మండలంలో ఎక్కడ కోళ్లకు ఎలాంటి వింత వ్యాధులు సోకలేవని, కోళ్ల ఆరోగ్యంగానే ఉన్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా కోళ్ల మరణించిన, వింత వ్యాధి సోకినట్టు గుర్తించిన వెంటనే వెటర్నరీ అధికారులకు లేదా సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భనలో ఆమె వెంట వెటర్నరీ సిబ్బంది, కోళ్ల ఫామ్స్ యజమానులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తా

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-నార్నూర్

ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడి ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం భోగ్ భండార్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మాజీ సర్పంచ్ గజానంద్ నాయక్, మాజీ జెడ్పీటీసీ బిరుజులాల్, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దేవరావ్ లోఖండే, నాయకులు షేక్ దాది అలీ, దుర్గే కాంతారావ్, చవాన్ మహేందర్, ప్రణీత, సుర్ సింగ్, రాథోడ్ దత్తారాం, శివాజీ పటేల్ ఉన్నారు.

పంట పొలంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఇచ్చోడ

రైతు బంధువు మాజీ సీఎం కేసీఆర్‌కు ముందస్తు జన్మదిన వేడుకను మండలంలోని ముక్రా(కె) గ్రామ రైతులు వారి పంట పొలాల్లో కేసీఆర్ ఫోటోకి పుష్పాభిషేకం చేస్తూ, ముందస్తు జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఆదర్శ రైతు గాడ్గే సుభాష్ మాట్లాడుతూ తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను గ్రామ రైతులు అందరూ కలిసి పంట పొలాల్లో పండుగలా జరుపుకోవడం జరిగిందన్నారు. మళ్లీ పల్లెలో సంక్షేమ పథకాలు అందాలంటే కేసీఆర్ సారే రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తిరుపతి, ప్రహ్లాద్, దత్త, శ్రీరామ్, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

27న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కేంద్రీయ విద్యాలయంలో పలు టీచర్ పోస్టుల కోసం ఈనెల 27న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీజీటీ (హిందీ, ఇంగ్లీష్, సోషల్, సైన్స్, గణితం, సైన్స్ సంస్కృతం), పీఆర్టీ, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, కౌన్సెలర్, స్టాఫ్ నర్సు, స్పెషల్ ఎడుకేటర్, సంగీతం, డ్యాన్స్ టీచర్, రీజినల్ లాంగ్వేజ్ (తెలుగు) టీచర్ పోస్టుల ఖాళీగా ఉన్నాయన్నారు. మరిన్ని వివరాల కోసం ఆదిలాబాద్.కేవీఎస్.ఏసీ.ఇన్ ను సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లాలో 10వ తేదీ నుంచి చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌరస్తాలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచే పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షపై అవగాహన కలిగి ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అన్నారు. సమాజంలో మెరుగైన పారిశుధ్యం, మొక్కల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులు కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికే పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, పరిశుభ్రంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పట్టణాన్ని స్వచ్ఛ నిర్మల్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఈఓ పి. రామారావు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, డీఈ హరిభువన్, అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి పోలీసుల వైఫల్యమే

- విధులు బహిష్కరించి నిరసన న్యాయవాదులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంగారెడ్డి ఎల్బీనగర్‌లో కోర్టులో న్యాయమూర్తిపై ట్రయల్ నిందితుడు దాడి చేయడం పోలీసుల వైఫల్యమే కారణమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ అన్నారు. న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. నిందితుడిపై చర్యలు తీసుకోవడంతో పాటు భద్రత చర్యలు కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్రాల నగేష్ మాట్లాడుతూ బహిరంగ కోర్టులో ట్రయల్ నిందితుడు రంగారెడ్డి ఎల్బీనగర్ 9వ అదనపు జడ్జీపై చెప్పుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో కూడా దాడులు జరిగిన సందర్భంగా న్యాయవాద రక్షణ చట్టం తీసుకురావాలని పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించిన ఎలాంటి ఫలితం లేకుండా పోతుందన్నారు. దాని కారణంగా దాడులు జరుగుతున్నాయన్నారు. పోలీసుల భద్రత వైఫల్యం కారణంగానే కోర్టులో న్యాయమూర్తిపై దాడి జరిగిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో హైకోర్టు కూడా పోలీసులకు దిశ నిర్దేశం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చందు సింగ్, అబ్దుల్లా ఖాన్, డీఎస్పీ శర్మ, అమరేందర్ రెడ్డి, ప్రదీప్ సర్కార్, దీలిప్ దేశ్‌ముఖ్, బొల్లారం సుదీర్, మహేందర్, కాప్రే రవీందర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

సైనికులు చేసే త్యాగాలు వెలకట్టలేనివి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం సైనికులు చేసే త్యాగాలు వెలకట్టలేనివని, ప్రజలకు శాంతియుత వాతావరణం కల్పించేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టే వారి సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పుల్వామా దాడిలో అమరులైన సైనికులకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్గిల్ పార్కులోని అమర వీరుల స్థూపం వద్ద అమర జవాన్లకు నివాళిగా పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి త్యాగాలను స్మరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఐదేండ్ల కింద ఇదే రోజు సీఆర్పీఎఫ్ జవాన్ల కాన్వయ్‌పై జరిగిన దాడిలో 43 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. వారి త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. యువత వారిని స్ఫూర్తిగా తీసుకొని దేశ రక్షణకు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, నారాయణ, సాజిదోద్దిన్, పండ్ల శ్రీను, మెట్టు ప్రహ్లాద్, నర్సింగ్, దాసరి రమేష్, ధమ్మపాల్, బుట్టి శివకుమార్ పాల్గొన్నారు.

హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో...

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అమర జవాన్లకు ఘన నివాళులర్పించారు. కార్గిల్ అమరవీరుల స్తూపానికి పుష్పాంజలి సమర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి, వారి ఆత్మకు శాంతి చేకురాలని ప్రార్థించారు. దేశం రక్షణ, భద్రత కోసం ప్రాణాలను అర్పిస్తున్న సైనికుల త్యాగలను గుర్తించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్‌దాస్ కోరారు. ప్రతి ఏటా మదిరిగానే ఈ సంవత్సరం కూడా అమరులకు ఘన నివాళులర్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకర్‌దాస్, కెప్టెన్ మజరోద్దీన్, రాజు, రేణికుంట్ల రవీందర్, కందుల రవీందర్, లక్ష్మణ్, రాజు, సంతోష్, నర్సింగ్ పాల్గొన్నారు.

కామర్స్ కళాశాలకు 40 వసంతాలు

- ఆకట్టుకున్న నృత్యాలు.. రక్తదాన శిబిరం ఏర్పాటు
- హాజరైన అదనపు కలెక్టర్ శ్యామలదేవి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల 40 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కళాశాలలో ఫార్మేషన్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ, ఎన్ఎస్-ఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలువురు విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం కళాశాల పూర్వ ప్రిన్సిపాళ్లు నారాయణరావు, సంతోష్ కుమార్‌లను శాలువాతో సన్మానించి, వారి సేవలను అభినందించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తోటి విద్యార్థుల ఈలలు వేస్తూ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ గురువుల విశిష్టతను, గురుశిష్యుల మధ్య సంబంధాన్ని తెలియజేశారు. గురువులను గౌరవించాలని విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. 41 వసంతంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో కళాశాల సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జేసీని, ప్రిన్సిపాల్‌ను కళాశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, ఎన్సీసీ కేర్ టేకర్ అధికారి చంద్రకాంత్, ఎన్సీసీ ప్రోగ్రాం అధికారులు పృథ్వీరాజ్, యాకూబ్ అలీ, కోటయ్య రేఖ, అనిత, స్వప్న, ముబారక్, గోపాల్, నరేష్, శ్రీనివాస్, బోధన బోధనేతర సిబ్బంది క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలెంటర్లు విద్యార్థులు ఉన్నారు.



పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురియంబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని, రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి నియమించాలని అలాగే వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి వాగ్మారే మహేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం మానుకోవాలని అన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్న ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం చాలా సిగ్గుచేటని అన్నారు. దీంతో ప్రభుత్వానికి విద్య వ్యవస్థ మీద ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. విద్యాశాఖ మంత్రి లేనందున విద్యా వ్యవస్థలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని అన్నారు. అన్ని శాఖలకు మంత్రులను కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ విషయంలో ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారో చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పవార్ కిరణ్ కుమార్, నాయకులు ఆవిరాజ్, విక్రమ్, సాయి, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త మూడు మొక్కలు నాటాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హరితహారం పేరుతో తెలంగాణను ఆకుపచ్చగా మార్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం వృక్షార్చన పేరుతో ప్రతి కార్యకర్త మూడు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పార్టీ కార్యాలయంలో మూడు మొక్కలు నాటి వృక్షార్చన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ జన్మదినం ఈనెల 17న ఉందన్నారు. వేడుకలను ఆర్భాటంగా జరుపుకోకుండా, పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణంపై అవగాహన కల్పించేలా ప్రతి ఒక కార్యకర్త మూడు మొక్కలు నాటాలన్నారు. తన వంతుగా పార్టీ కార్యాలయంలో మూడు మొక్కలు నాటడం జరిగిందన్నారు. వృక్షాలతో మానవ మనుగడ ఉందని, వాటిని పెంచుకుంటూ పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, నారాయణ, సాజిదోద్దిన్, పండ్ల శ్రీను, మెట్టు ప్రహ్లాద్, నర్సింగ్, దాసరి రమేష్, ధమ్మపాల్, బుట్టి శివకుమార్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

- నలుగురి యువకుల అరెస్ట్

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారానికి పాల్పడ్డా నలుగురు యువకులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువతిపై మండలంలోని మరో గ్రామానికి చెందిన నలుగురు యువకులు యువతికి కొన్ని రోజుల నుంచి మాయ మాటలు చెప్పుకుంటూ, గ్రామం చివరకు తీసుకెళ్లి యువతిపై అత్యాచారానికి పాల్పడ్డారు. బుధవారం కూడా యువతిని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండాగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసు లు కేసు నమోదు చేశారు. శుక్రవారం నలుగురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రజా సమస్యలను బహిరంగ విచారణ జరిపి, తక్షణమే పరిష్కారం చేసేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కర కేంద్రం ముఖ్య ఉద్యేశమని జెడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజా వేదికలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రం, బహిరంగ విచారణ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, గ్రామస్తుల సమక్షంలో 107 సమస్యల దరఖాస్తులను విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మణ్ మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్ట్ ప్రజావాణి కార్యక్రమంలో ఇచ్చోడ గ్రామానికి సంబంధించిన 107 సమస్యలు ఉండగా, గ్రామస్తులు, అధికారుల సమక్షంలో బహిరంగ విచనారణ చేయగా, 35 సమస్యలను పరిష్కారం అయినట్లు తెలిపారు. త్వరలోనే మిగతా 72 దరఖాస్తులను క్షేత్రా స్థాయిలో పరిశీలించి, సంబంధించిన అధికారుల అభిప్రాయలను తీసుకోని, పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కైలాస్, ఈఓ సూర్య ప్రకాష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

3

కుమురంభీం ఆసిఫాబాద్

శనివారం | ఫిబ్రవరి 15, 2025 | www.navatelangana.com

పుల్వామా అమరులకు నివాళులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



దేశరక్షణలో ఉండగా ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలర్పించిన పుల్వామా అమరవీరులకు సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులు అర్పించారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు అమవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు యు నారాయణ, కలికోట రమణయ్య, ఎం రాంబాబు, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, వెంకటి, ఫారూక్ అహ్మద్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని బారెగుడాలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సమాచారం మేరకు బారెగూడ గ్రామంలోని సంతోస్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఇక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన 7 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని స్వాధీనపరుచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీని విలువల రూ.17,500 ఉంటుందని తెలిపారు. ఈ మేరకు సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఈ నెల 27న జిల్లాలో జరుగనున్న పోలింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయివేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థలలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27న ఉదయం 8 నుండి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. ప్రయివేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విధులలో వెసలుబాటు కల్పిస్తామన్నారు. ఆయా సంస్థల యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని తెలిపారు.

ప్రజల గొంతుక వినిపించే వారిని ఎన్నుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

శాసనమండలిలలో ప్రజల గొంతుక వినిపించే బీజేపీ అభ్యర్థులను రానున్న ఎంఎల్‌సీ ఎన్నికలలో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, సిర్పూరు నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్‌ఛార్జి కొయ్యల ఏమాజీ కోరారు. శుక్రవారం కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆయన స్థానిక ఎమ్మెల్యే నివాసంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ అభ్యర్థిగా అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సీ అభ్యర్థిగా మల్క కొమురయ్యలు పోటీ చేస్తున్నందున వారిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు శివకుమార్, నాయకులు వీరభద్రచారి, అశోక్, అర్జున్, రాణి, నానాజీ, విశాల్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన వార్షికోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి ప్రక్కన అభయాంజనేయ స్వామి విగ్రహ 14వ చతుర్దశ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఒజ్జుల శిరీష్ శర్మ నేతృత్వంలో వేదపండితులు మాడుగుల నారాయణ మూర్తి, మహేశ్ శర్మ వారణాసి శ్రీనివాస్ శర్మ, ఢిల్లీ విజయ్ కుమార్‌లు స్వామి వారికి ఉదయం కలశ పూజ, పుణ్యావాహవచనం, నవగ్రహరాధన, ఏకాదశ రుద్రాభిషేకం, స్థాపిత దేవతవహనం మన్యసూక్త హవనం, పూర్ణ హుతి మంగళహారతి, మహామంత్ర పుష్పం, మహదాశీర్వచనం నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే కోవలక్ష్మి, యువ నాయకుడు కోవ సాయినాథ్, అలయకమిటి ఛైర్మెన్ మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండ వెంకన్న, ప్రచార కార్యదర్శి రాధాకృష్ణ చారి, డాక్టర్ మధు, శ్రీనివాస్, గడ్డల వెంకటేష్, మురళిగౌడ్, గోపాల్ నాయక్, సుధాకర్, లక్ష్మణ మూర్తి, శరత్ యాదవ్, ఎగర్ష శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పారితోషికం ఇవ్వాలి : పీఆర్టీయూ వినతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన పారితోషికాన్ని చెల్లించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే ప్రతిష్టాత్మకంగా పూర్తి చేయడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందన్నారు. అయిన ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన పారితోషికం చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పారితోషకం విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని వినతిపత్రంలో కోరారు. ఆయనతో పాటు సంఘం నాయకులు మధుకర్, తిరుపతి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రధానమంత్రి శ్రీ పథకం క్రింద జిల్లాలో ఎంపికైన పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను మార్చి నెల చివరి వారంలో పూర్తి చేసే విధంగా వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆదేశించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి జిల్లాలో ప్రధానమంత్రి శ్రీ పథకం క్రింద ఎంపికైన 18 పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల ప్రత్యేక అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అదనపు గదులు, మూత్రశాలలు, ప్రహరీ గోడ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, భవన మరమ్మత్తులు, సైన్స్ ల్యాబ్, తరగతి గదులలో ఫ్యాన్లు, వెలుతురు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు విద్యార్థినుల స్వీయ భద్రత కోసం కరాటేలో మెళకువల శిక్షణ వంటి పనులను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. మార్చి నెల చివరి నాటికి పనులను పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయానికి వినియోగానికి సిద్ధం చేయాలని తెలిపారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులు నిరంతరం పనుల నాణ్యతను తనిఖీ చేయాలని, కేంద్రం నుండి పనులను పరిశీలించేందుకు అధికారులు వస్తారన్నారు. ప్రతి పనికి సంబంధించి డాక్యుమెంట్లు తప్పనిసరిగా ఉండాలని, పనుల ప్రారంభానికి ముందు, పనులు జరుగు సమయంలో, పనులు పూర్తి అయిన తర్వాత ఫోటోలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతి అంశం పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రణాళిక సమన్వయకర్త అబిద్ అలీ, ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు, ప్రధానోపాధ్యాయులున్నారు.



దాతృత్వం చాటుకున్న గిరి యువత

- బ్రెయిన్ క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక చేయూత



నవతెలంగాణ-కెరమెరి

తిర్యాణి మండలంలోని గడలపల్లి గ్రామ పంచాయతీ రాళ్ళ కన్నెపల్లి గ్రామానికి చెందిన మడావి గుణ వంత్ రావు (సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షులు) సతిమణి బ్రెయిన్ క్యాన్సర్‌తో హైదరాబాద్ నిమ్స్‌లో రెండు నెలలుగా చికిత్స పొందుతున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసిన ఆమె ఆరోగ్యం కుదుట పడలేదు. సామాజిక ఉద్యమల్లో చురుకైన పాత్ర పోషించిన యువ ఉద్యమనేత రాజకీయాలలో వచ్చి, తనదైన శైలీలో చురకుగా ప్రజలకు సేవ చేసిన నాయకుడు గుణవంత్ రావు, భార్య అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమంలో ఆర్థిక సాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన కెరమెరి మాజీ సర్పంచ్లు, గిరిజన యువ నాయకులు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. మండలం కేంద్రంలో పలువురిని సంప్రదించి సమస్యను వివరించారు. తోచిన సాయం చేయాలని అభ్యర్థించగా సుమారు రూ.20,000 వేలు సమీకరించారు. పోగేసిన డబ్బులను గుణవంత్ రావుకు అందించారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారు. దాతలు 9177942656 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం, కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, బీజేపీ మండల అధ్యక్షులు సెడ్మకి తుకారం, ఆదివాసీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు మాడవి భరత్ భూషణ్, సాంగ్వి మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్ రావు, ఆదివాసీ నాయకులు సోము పాల్గొన్నారు.

న్యాయవాదులు రక్షణపై చర్యలు తీసుకోవాలి

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



న్యాయవాదుల రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో మహిళ న్యాయమూర్తిపై నేరస్థుడు దాడి చేసిన ఘటనను ఖండిస్తూ జిల్లా కేంద్రంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు చేసి కోర్టుకు వచ్చేవారు న్యాయవాదులు న్యాయమూర్తులపై అతిగా ప్రవర్తించడానికి ఖండిస్తున్నట్లు తెలిపారు. కోర్టులో న్యాయమూర్తిపై చెప్పుతో దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. నిందితుడు కరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమూర్తికి అండగా ఉండడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి సంఘటన జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బానోత్ గణేష్, శ్యాంరావ్, అజ్మెర గణపతి, విద్యాసాగర్, సతీష్ బాబు, అనిత పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : రాష్ట్రంలో పలు ప్రాంతాలలో న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని, ఇప్పుడు న్యాయమూర్తి దాడి జరిగిందని ఇప్పటికైన ప్రభుత్వాలు రక్షణ చట్టం తీసుకురావాలని సిర్పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పెద్దపెల్లి జిల్లాలో న్యాయవాదుల దంపతుల హత్య, జనగాం జిల్లాలో అమృతరావు, కవిత దంపతులకు జనగాం పోలీస్ స్టేషన్‌లో అవమానం జరిగిందన్నారు. ఈ సంఘటనలు మరువకముందే రంగారెడ్డి జిల్లా తొమ్మిదవ అదనపు కోర్టులో కేసు విచారణ సమయంలో మహిళా న్యాయమూర్తిపై నిందితుడు చెప్పు విసిరాడన్నారు. ఇలా న్యాయ వ్యవస్థను కాపాడే న్యాయమూర్తి, న్యాయవాదులకు రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఎంటని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, సీనియర్ న్యాయవాదులు రైస్ అహ్మద్, శంకర్‌రావు, దయరాజ్ సింగ్, బి.శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, గంట కళ్యాణ్, సతీష్, మతిన్, అల్లూరి దివాకర్, దుర్గం రవీందర్ పాల్గొన్నారు.

ఘనంగా భీమాబాయి జయంతి



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ తల్లి భీమాబాయి రాంజీ సత్పాల్ 171వ జయంతిని భారతీయ బౌద్ధ మహా సభ, అంబేద్కర్ సంఘం, సిద్ధార్థ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహ సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహల్కర్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు ఉప్రే జయరాం మాట్లాడుతూ తన జీవితకాలంలో కేవలం 42 సంవత్సరాలు మాత్రమే బ్రతికిన భీమాబాయి 14 మంది సంతానానికీ జన్మ నిచ్చిందని, చివరి వాడైన భీంరావ్ అంబేద్కర్‌ను చదివించడంలో అనేక కష్టాలను సహించి ఉన్నత విద్యా వేత్తను, ఈ దేశానికి రాజ్యాంగ నిర్మాతను అందించిన మహనీయురాలు అని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్క తల్లి తన బిడ్డలను చదివించడానికి అంబేద్కర్ తల్లి భీమాబాయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతులను నిర్వహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్ కుమార్, ఉపాధ్యక్షులు దుర్గం హంసరాజ్, ఎస్ఎస్‌డీ ఇన్‌చార్జి దుర్గం సందీప్, బౌద్ధ సమాజ అధ్యక్షుడు విలాస్, రాజేంద్రప్రసాద్, పాండు జి, రోషన్, అరుణ్, విజయ్, శ్యాంరావు, దిలాజి, వివేక్, బల్వంత్ పాల్గొన్నారు.

ఎర్ర బండ గిరిజన రైతులకు అండగా ఉంటాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని, తిర్యాణి మండలం మంగి గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రబండ గిరిజన రైతులకు అండగా ఉంటామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. గ్రామ రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిర్యాణి మండలం మంగి గ్రామ శివారు ఎర్రబండ గ్రామానికి చెందిన గిరిజన రైతులు 40 సంవత్సరాల నుండి ఖాస్తు కబ్జాలో ఉన్న భూములను సాగు చేస్తున్నారన్నారు. ఆ భూములకు రెవిన్యూ అధికారులు గతంలో పట్టా మంజూరు చేశారని, ప్రస్తుతం మండలానికి వచ్చిన తహసీల్దార్ వారి పట్టా రద్దు చేసినట్లు తెలపడంతో పాటు వారిని భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో గిరిజనుల పట్టాలు తొలగించడంతో వారికి పహాని, 1బి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఫిర్యాదు చేసిన 15 రోజుల్లో విచారణ జరిపి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయిన రెవెన్యూ అధికారులు నోటీసులు పంపుతున్నారని తెలిపారు. గిరిజన రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని, వెంటనే గిరిజన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తిక్, గేడం టీకనంద్, కృష్ణమాచారి, తిరుపతి, నిర్వాసిత రైతులు కినక జన్ను, మర్సుకోల బాజిరావ్, గ్రామ పటేల్ ఆత్రం ఆత్మరావ్, కొర్వేత దేవ్, సోయం చిత్రూ, కినక మాంకు పాల్గొన్నారు.

కూర రఘోత్తం రెడ్డికి మద్దతుగా ప్రచారం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్, ఎస్టీయూ, పీఆర్టీయూటీజీ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో బరిలో నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తంరెడ్డికి మద్దతుగా జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ సంఘభవన ప్రాంగణంలో సంఘాల ప్రతినిధులు సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయుల తరపున పోరాటం చేసేవారికి మద్దతు ఇవ్వాలన్నారు. ప్రధాన సమస్యలైన సీపీఎస్ రద్దు, డీఏ విడుదల మెడికల్, సరెండర్ బిల్లులు, 317 జీఓ సమస్య పరిష్కారం లాంటి వాటిపై పూర్తి అవగాహన ఉండి పరిష్కారం కోసం కృషి చేస్తున్న కూర రఘోత్తం రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బత్తుల శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి పెంద్యాల సదాశివ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తులసీరామ్, వైరాగడ లక్ష్మణ్, టీఎస్‌యూటీఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బన్న రవీందర్, పత్తి సత్తయ్య, పీఆర్టీయూ తెలంగాణ నాయకులు కటక మధుకర్, మామిడాల తిరుపతయ్య, ఆడే ప్రకాష్ పాల్గొన్నారు.

మీ-సేవ కేంద్రాల తనిఖీలకు ఆదేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని మీ-సేవ కేంద్రాలలో తనిఖీలు చేపట్టాలని డీఆర్‌ఓ లోకేశ్వర్ రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఆర్టీఐ కార్యకర్త మహమ్మద్ ఆసిఫ్ జిల్లాలోని మీ-సేవ కేంద్రాలలో కేటాయించిన వారు కాకుండా ఇతరులు మీ-సేవ కేంద్రాలను నిర్వహిస్తున్నారనీ, ఉద్యోగాలు వచ్చిన వారు సైతం బంధువులకు లీజుకి ఇస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదుకు ఆయన స్పందించారు. దీంతో కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశిస్తు తహసీల్దార్లకు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

విద్యుత్ లైన్ పనుల కారణంగా నేడు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని కౌటాల విద్యుత్ ఏడీఈ రాజేశ్వర్ తెలిపారు. నేడు 33కేవీ విద్యుత్ లైన్ లోనవెల్లి నుండి కౌటాల ఫీడర్ లైన్ మధ్యలో 132 కేవీ టవర్ లైన్ పనులు జరుగుతున్నందున మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మహా శివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-తిర్యాణి

మండల కేంద్రంలో చెలిమేల ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టు వద్ద వెలిసిన శ్రీ నాగోబా దేవస్థానం జాతర పోస్టర్లను విడుదల చేశారు. ఇందులో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, రాయిసెంటర్, ఉపాధ్యాయ, ఆదివాసీ సంఘం నాయకులతో కలిసి ఆలయ కమిటీ సభ్యులు పోస్టర్లను ఆవిష్కరింపజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ఈనెల 26న రాత్రి 7 గంటలకు మహాభారతం నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఇంట్లో భాగంగానే ఈనెల 17 నుంచి 27వ తేది వరకు క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యమంలో ఆలయ కమిటీ నాయకులు ఎడమ వాసుదేవ్, మడావిడి నాందేవ్, ఆత్రం యమునారావు, వివిధ పార్టీ నాయకులు సితార సాగర్, కురుశంగమూతి రావు, ఆదివాసీ నాయకులు దారుము ఉపేందర్, ధర్మం పాల్గొన్నారు.

వేలాల జాతర ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-జైపూర్



వేలాల జాతర సంధర్భంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా పోలీస్ అధికారలు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏడాది భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని భావిస్తున్న అధికారులు అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేపిస్తున్నారు. స్థానిక ఎస్ఐ శ్రీధర్, శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్‌తో కలిసి శుక్రవారం వేలాల గ్రామాన్ని సంధర్శించిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. గోదావరి నది నీరు భక్తులకు అందుబాటులో ఉండేందుకు నదీ ప్రవాహాన్ని ఘాట్ ఏరియా వరకు తరలిస్తున్నారు. వాహణాల పార్కింగ్ ఏరియా ప్రత్యేక రహదారి ఏర్పాటు పనులను పర్యవేక్షించారు. వీఐపీల వాహణాల రాకపోకలకు ప్రత్యేకమైన రూట్ ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. గుట్ట పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ గుట్టపైన భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

నవతెలంగాణ-నార్నూర్



గాదిగూడ మండలంలోని అర్జునీ ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం లీటిల్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత బ్యాగ్‌లతో పాటు కంపాక్స్ బాక్స్ పంపిణీ చేశారు. సామాజిక సేవలో లిటిల్ ఫౌండేషన్ ముందుకు ఉంటుందని ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఆశప్ప ప్రమోద్ పేర్కొన్నారు. బ్యాగ్ పంపిణీ కార్యక్రమంలో మెస్రం శేఖర్‌బాబు, సభ్యులు తుమ్మల్‌వార్ చందు, నెమలికొండ దేవిడ్, నాగార్జున, దినేష్, మహేష్, అనిల్, రాజు ఉన్నారు.

పేకాట రాయుళ్ల బైండోవర్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని బలరావుపేట గ్రామ శివారులో ఈ నెల 12న పేకాట స్థావరంపై లక్షెట్టిపేట ఎస్ఐ సతీష్ సిబ్బంధితో కలిసి దాడి చేసి 7 గురు పేకాటరాయుళ్ళను పట్టుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారికి శుక్రవారం రూ. లక్ష పూచీకత్తుపై తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ చేయబడిన పేకాటరాయుళ్ళు బత్తుల రమేశ్, కోన తిరుపతి, బేర రాజయ్య, సంగ ఒదయ్య, గోర్క మల్లేష్, వనపర్తుల సుధాకర్, మండే సత్తన్న ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

నవతెలంగాణ-హాజీపూర్

మండల శివారు జాతీయ రహదారిపై జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. హాజీపూర్ ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12వ తేదీన హాజీపూర్‌కు చెందిన పూస్కూరు శ్రీనివాసరావు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగ ఒక్కసారి ఎదురుగా వచ్చిన దాదాపు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు మధ్య గల గుర్తు తెలియని మతిస్థిమితం లేని మహిళను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో పూస్కూరు శ్రీనివాసరావు స్వల్ప గాయాలతో బయటపడగా గుర్తు తెలియని మహిళకు తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. తెలియని మహిళ మృతదేహాన్ని మంచిర్యాల గోదావరి తీరంలో ఖననం చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలలో మెరుగైన వసతులను కల్పించాలి



నవతెలంగాణ-నిర్మల్

సమగ్ర శిక్ష, పీఎంశ్రీ నిధులతో ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులను కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన సమగ్ర శిక్ష, పీఎంశ్రీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, పాఠశాలల్లో అవసరమై సదుపాయాలను సమకూర్చాలన్నారు. జిల్లాలకు విడుదలైన నిధులు, నిధులతో చేపట్టిన పనులు, మిగిలి ఉన్న నిధులకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో సివిల్ వర్క్స్, క్రీడా సామాగ్రి, విద్యార్థులచే పలు కార్యక్రమాల నిర్వహణకు ఈ నిధులను వినియోగించాలన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ సీఎం సమగ్ర శిక్ష నిధులతో ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పలు కార్యక్రమాలను చేపట్టామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ రామారావు, ఏఎస్ లింబాద్రి, విద్యాశాఖ అధికారులు రాజేశ్వర్, వెంకటరమణ, శ్రావణి, నర్సయ్య, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చోరీ కేసులో పట్టుబడ్డ ఇద్దరు రిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఓ పాన్‌షాప్‌లో జరిగిన చోరీ కేసులో ఇద్దరు దొంగలను పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు 1 టౌన్ సీఐ సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 11న మంగళవారం రాత్రి పట్టణంలోని నటరాజ్ థియేటర్ వద్ద ఉన్న మహరాజ్ పాన్‌షాప్‌లో దొంగతనం జరిగిందని ఎస్సై పద్మ కేసు నమోదు చేసిందని పేర్కొన్నారు. శుక్రవారం ఠాకూర్ హోటల్ వద్ద దొంగను పట్టుకున్నట్లు వెల్లడించారు. మహలక్ష్మివాడకు చెందిన రతన్, మరొక దొంగను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని అఖిల పక్షం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికంగా పత్తి కొనుగోళ్లు జరిపినట్టు విజిలెన్స్ అధికారులు రిపోర్ట్‌లో పొందుపరిచారని పేర్కొన్నారు. ఈ విషయంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవిదాస్, లోకారి పోశెట్టి ఉన్నారు.

వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-మంచిర్యాల

నెన్నెల మండలం మైలారాం గ్రామానికి చెందిన గర్భిణి గావిడి సుమలత కడుపు కోతకు కారణమైన వారిపై చర్యలు ఈసుకోవాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ(ఎం) నాయకులు సుమలత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని మాత శిశుఆస్పకి ప్రసవం కోసం వెళ్లినప్పటికీ వైద్యులు సకాలంలో వైద్యం అందకపోవడంతో కడుపులోనే శిశువు మృతి చెందిందన్నారు. గత రెండు రోజులుగా బాధితురాలు, కుటుంబ సభ్యులు డాక్టర్లను వేడుకున్న కనికరం చూపకపోవడంతో ఈ దారుణం జరిగిందన్నారు. చివరికి ఈ నెల 14న ఉదయం 4 గంటల ప్రాంతంలో ఆపరేషన్ చేసి మృత శిశువును కుటుంబ సభ్యులకు అందించడం బాధాకరమన్నారు. చనిపోయిన శిశువును పట్టుకొని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగితే తమ నిర్లక్ష్య ధోరణి బయటపడి ఎక్కడ ఉద్యోగాలు పోతాయోననే భయంతో మరణించిన శిశువు ఇతర కుటుంబ సభ్యులతో దహన సంస్కారణలకు ఇంటికి పంపడమేంటన్నారు. తొలి కాన్పుతో బిడ్డ కోసం సంతోషంగా ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా విషాదమే మిగిలిందన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్, కామిల్లా జయరావ్, ఐఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలి

- ఎఫ్‌డీపీటీకి వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-జన్నారం



వాహనాల రాకపోకలపై అటవీశాఖ విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని మండల ప్రజలు, పలువురు నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం ఎఫ్‌డీపీటీ శాంతారామ్, డీఎఫ్ఓ శివ ఆసీస్ సింగ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంక్షల పేరుతో అటవీ అధికారులు స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాకపోకలకు అంతరాయంతో స్థానికంగా వ్యాపార, వాణిజ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. 2013లో జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకల నిషేదంతో వ్యాపారాలు దెబ్బతిని 12 ఏళ్ల అభివద్ధిని కోల్పోవటం జరిగిందన్నారు. 2017 నుండి పర్యావరణ సెస్ పేరిట పేద, మధ్య తరగతి అమాయక గిరిజన ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తూ వచ్చిందన్నారు. 2025 జనవరి నుండి అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద రాత్రి 9 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు అనుమతించకపోతుండటంతో నియోజకవర్గ ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలకు సుమారు 150 కిలోమీటర్ల అదనంగా దూరభారం పెరుగుతుందన్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా దట్టమైన అటవీప్రాంతం కేవలం 20-25 కిలోమీటర్లు మాత్రమే ఉందని, వన్యప్రాణుల రక్షణ కోసం రహదారికి ఇరువైపులా కంచె లేదా అండర్పాస్‌లు నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా అటవీశాఖ అధికారులు ఆలోచించక ప్రజలకు ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. కందకాలు, కొన్ని ప్రాంతాల్లో కంచె నిర్మించడం, అడవిలోపల నీటి సదుపాయం పెరగటంతో రోడ్లపై వన్యప్రాణులు సంచరించటం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. దేశంలో పులులున్న అనేక టైగర్ రిజర్వులలో లేని నిభందనలు పులి లేని ఇక్కడి ప్రాంతంలో అటవీశాఖ వారు విధించటం గమనార్హం అన్నారు. ఆంక్షలను వెంటనే ఎత్తివేసి శాంతియుత వాతావరణంలో సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని, 24 గంటలు రాకపోకలకు అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు భూమాచారి, కాంగ్రెస్ నాయకులు గుర్రం మోహన్ రెడ్డి, మహమ్మద్ రియాజుద్దీన్, మిక్కిలినేని రాజశేఖర్, సతీష్, అల్లం వెంకటరాజ్యం, జక్కుల సురేష్, నందు నాయక్, సోహెల్, ఎండీ బాబా, ఎస్‌కే ఇక్రం,, ముస్తఫా పాల్గొన్నారు.

కాసిపేట -2 ఇంక్లలైన్ గనిలో అత్యధిక ఉత్పత్తి



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్‌లైన్ గని ఏర్పాటు నుంచి చరిత్రలో మొదటి సారి అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించింది. గురువారం బొగ్గు ఉత్పత్తి చేయగా శుక్రవారం గని మేనేజర్ కార్యాలయంలో మేనేజర్ గొడిశల లక్ష్మీ నారాయణ ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉద్యోగులను, అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క రోజులో 443 టబ్బుల ఫిల్లింగ్ ద్వారా అత్యధికంగా 600 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. ఉత్పత్తిలో భాగస్వామ్యమైన ఉద్యోగులను అభినందిస్తూ ఇదే ఉత్సాహాన్ని పెంపొందించాలని ఉద్యోగులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రెండు నెలలు కూడా ఇదే స్ఫూర్తితో ఉత్పత్తిని కొనసాగించాలని మరో 10 శాతం అధిక ఉత్పత్తి కొరకు ప్రతి ఉద్యోగి, అధికారి అంకితభావంతో పని చేయాలని కోరారు. సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు, సూపర్వైజర్లు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనతి కాలంలోనే ఆలయ నిర్మాణం

- ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ రావు

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో సీతారామ ఆలయ నిర్మాణం స్వల్ప వ్యవధితో పూర్తి చేసుకోవడం శుభ శూచకమని ప్లాంట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రాజశేఖర్ రావు అన్నారు. 9 నెలల వ్యవధితో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకోవడానికి సహాయ సహకారం అందించిన వారందరికి శుక్రవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 ఎప్రిల్ నెలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసి అతి తక్కువ సమయంలో నిర్మాణ పనులు పూర్తి చేయడమే కాకుండా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. అంతేకాకుండా సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు దంపతులు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదేవిదంగా ఆలయ నిర్మించిన స్థపతి రామ్ కుమార్, సందరం మూర్తి, పేయింటర్ హరిహరన్‌లకు స్వామి వారి శేష వస్త్రాలతో ఈడీ రాజశేఖర్ రావు సన్మానించారు. అదేవిధంగా జ్ఞాపికలు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం ఈఅండ్ఎం శ్రీనివాసులు, చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జేఎన్ సింగ్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ సత్యనారాయణ, ఆలయ కమిటి అధ్యక్షుడు ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, ఆలయ కమిటి సెక్రెటరీ సముద్రాల శ్రీనివాసు, ఏజీఎం సివిల్ కేఎస్ఎన్ ప్రసాద్, పీఎంపీఎల్ హెడ్ అఖిల్ కపూర్, పీఈఎస్ కంపెనీ హెడ్ రమేష్ చంద్ర, డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎక్స్‌టర్నల్ ఎవల్యూషన్ టీం అధికారులు అజయ్ కుమార్ విజయ్ కాంత్ పద్మజ అన్నారు. శుక్రవారం మండలంలోని తపాలాపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో సందర్శించారు. ఈ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్క్స్ వెరిఫికేషన్ చేశారు. హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల నిర్మాణాత్మక మూల్యాంకనం మార్కుల రికార్డ్స్ పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. యు డైస్ వివరాల పరిశీలన నిమిత్తం మండల ఎంఈఓ విజయకుమార్ పాఠశాల వసతులు, మధ్యాహ్న భోజనం నిర్వహణ తదితర అంశాలు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్‌కి ధ్రువీకరణ పత్రం అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మానాన్న దీవెన వేడుకలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెటిపేటలోని లిటిల్ స్టార్ గ్రామర్ స్కూల్‌లో శుక్రవారం అమ్మానాన్న దీవెన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సంతపరి కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుండే అమ్మానాన్నల ప్రేమను గుర్తు చేయాలన్నారు. ప్రేమ అంటే ఇద్దరు యువతి యువకుల మధ్య కలిగేది మాత్రమే కాదు, తల్లిదండ్రుల ప్రేమ కూడా ఎంతో విలువైనది వెలకట్టలేనిదన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రేమను తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ప్రేమికుల రోజున విద్యార్థులకు తమ తల్లిదండ్రుల ప్రేమను గుర్తుచేస్తూ పిల్లలకు అమ్మానాన్నల దీవెనలు అందించినందుకు కార్యక్రమం లో పాల్గొన్న పాఠశాల పోషకులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులలో సజనాత్మకత, క్రమశిక్షణ పెద్దలపై గౌరవ మర్యాదలు పెంపొందించుటకు కషి చేస్తున్నటువంటి పాఠశాల యాజమాన్యానికి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మహమ్మద్ హమీద్, మినుముల శ్రీనివాస్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

దేశం సుభిక్షంగా ఉండేందుకే మహాయాగం



నవతెలంగాణ-నస్పూర్

దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని దేశమంతా యజ్ఞ యాగాలు చేస్తున్నట్లు శ్రీకష్ణ పీఠాధిపతి శ్రీకష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి తెలిపారు. శుక్రవారం నస్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నస్పూర్ పట్టణంలో శనివారంతో మొదలై 15 రోజులు పాటు యజ్ఞ యాగాలు, హోమాలు, ఉంటాయని, భక్తులకు ఉచితంగా ముందస్తు నమోదు చేసుకొని యజ్ఞయాగాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి రోజు ధ్యానం ఉపనిషత్ భాష్యము, శ్రీ మద్భగవద్గీత, భాగవతము పై అమత భాష్యములుంటాయన్నారు. కుల మతాలకతీతంగా పాల్గొని మహా యజ్ఞాన్ని దిగ్విజయం చేసి సంపూర్ణ యాగఫలితాన్ని పొందాలని ఆకాంక్షించారు. యాగానికి వచ్చి భక్తులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, రాత్రి అల్పాహారం సౌకర్యాలు ఉంటాయని, సమయానకూలంగా పలు సాంస్కతిక కార్యక్రమాల నిర్వహిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌పై సీడీపీఓ ఆగ్రహం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని మర్కాగూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఉట్నూర్ సీడీపీఓ వినూత్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ కేంద్రంలో గుడ్లు, వంట నూనె, బాలామృతం, పాల పాకెట్లు లేక పోవడంతో అంగన్‌వాడీ టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా గర్భవతులు, పిల్లలకు, బాలింతలకు పోషకాహారం వంటలు అందించడం లేదని గ్రామస్తులు సీడీపీఓ దృష్టికి తెచ్చారు. సరియైన పోషకాహారం అందించాలని, కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. లేనియెడల చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపిస్తే కట్టుబడి పనిచేస్తా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టభద్రుల సమస్యలను పరిష్కరించి, అందరూ సంతృప్తి చెందే విధంగా పనిచేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన పాల్గొని మాట్లాడారు. మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా కామన్ మ్యాన్ వర్సెస్ కార్పొరేట్ మ్యాన్ మధ్య జరుగుతున్న పోటీ గమనించాలన్నారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రంగినేని పవన్ రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షులు, పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యక్షులు అమీరొద్దీన్, పటాస్కర్, రాజేశ్వర్ గురూజీ, షబ్బీర్ ట్రస్మా బాధ్యులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-తాండూర్

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్‌కు తాండూరు హై స్కూల్‌కు చెందిన 8వ తరగతి ఆంగ్ల మాధ్యమ విద్యార్థి ఎండీ మక్సూద్ ఎంపికైనట్లు హెచ్ఎం దుర్గం శ్రీనివాస్ తెలియజేశారు. విద్యార్థికి ఏటా రూ. 12 వేల చొప్పున ఇంటర్మీడియట్ విద్య పూర్తయ్యే వరకు నాలుగేండ్లు రూ. 48 వేలు ప్రభుత్వం నేరుగా విద్యార్థి ఖాతాలో జమ చేస్తుందన్నారు. విద్యార్థి ప్రతిభను ప్రశంసిస్తూ బోధన సిబ్బంది ప్రత్యేక బహుమతులను అందజేశారు. తరగతి ఉపాధ్యాయురాలు సరోజ రూ.500 నగదు ప్రోత్సాహక బహుమతిని అందించింది. ఇందులో ఉపాధ్యాయులు అజీముద్దీన్, రామన్న, జ్యోతి, భరత్, సత్యనారాయణ, అశోక్, వెంకటస్వామి, కష్ణ, రమేష్, సంతోష్, నాగరాజు, సరోజ, మహేశ్వరి, గోపి, ఉమామహేశ్వరి, లత, వినోద్ కుమార్, సత్యవతి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-కడెం



తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం శుక్రవారం తెలంగాణ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రేంకల శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం నుంచి గాంధీభవన్ వరకు యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు భారీ ర్యాలీగా వెళ్లి కార్యక్రమానికి హాజరైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని వారికి దిశా నిర్దేశం చేశారని పేర్కొన్నారు.

సవారీ బంగ్లా నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్లి(కె)గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సవారీ బంగ్లా నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు ప్రీతంరెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, అబ్దుల్లా, లక్ష్మణ్, పాండు, రమేష్‌రెడ్డి, అభిరామిరెడ్డి, సంతోష్, సామాజిక కార్యకర్త మౌనిష్‌రెడ్డి, రాంబాయి, పల్లవి, గ్రామస్తులు పాల్గొన్నారు.



డా.సుహాసిని వేణుగోపాలకృష్ణకు సన్మానం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వ వైద్య కళాశాలలో బయోకెమిస్ట్రీ డీఆర్‌పీ వైద్యులు డా.వేణుగోపాలకృష్ణ అతని కూతురు సుహాసినిని శుక్రవారం వైద్య కళాశాలలో ఘన సన్మానించారు. తండ్రి, కూతురు ఇద్దరూ కలెక్టర్ చేతుల మీదుగా ప్రేమతో నాన్నకు నంది పురస్కారాలు అందుకున్న సందర్భంగా ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వివేక్ కృష్ణ, వైద్య విద్యార్థులు బాలాజీ, మనసా, వహిద్, శ్రుతి, సుహాసిని పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ నాయకులను తొలగిస్తూ ఉత్తర్వులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీయూటీఎఫ్ సంఘ నాయకుల ప్రాతినిధ్యం మేరకు పదో తరగతి మూల్యాంకన విధుల నుంచి అన్ని ఉపాధ్యాయ సంఘాల మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను తొలగిస్తూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ఉత్తర్వులు జరిచేసినట్టు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవిని కలిసి కేవలం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘ నాయకులను మాత్రమే అంతర్గత మూల్యాంకన విధుల నుంచి తప్పించారని విన్నవించామన్నారు. అన్ని సంఘాల నాయకులను తప్పించాలని ప్రాతినిధ్యం చేశామని పేర్కొన్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేయగా నేడు ఉత్తర్వులు వచ్చాయని పేర్కొన్నారు.

17న అక్రమ ఇసుక వేలం పాట

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ మండలంలోని మంజులాపూర్‌లో ఈనెల 11న దాడులు చేసి, అక్రమ ఇసుకను సీజ్ చేయడం జరిగిందని, రూరల్ తహసీల్దార్ సంతోష్ కుమార్ తెలిపారు. సదరు 35 ట్రాక్టర్ల ఇసుకను ఈనెల 17న సోమవారం ఉదయం 11 గంటలకు మంజులాపూర్‌లో వేలం వేస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు ముందస్తుగా రూ.2000లు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చునని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఇటీవల బీజేపీ పట్టణాధ్యక్షుడిగా ఎన్నికైన ఆకుల కార్తీక్‌ను శుక్రవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు లింగన్న ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు జనార్ధన్, కూన రాములు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బాధిత కుటుంబాలను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త కృష్ణ క్లాత్ స్టోర్ బట్టల దుకాణం జనార్ధన్ యజమాని మృతిచెందడంతో జనార్ధన్ కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాలరాజు తల్లి రుక్మవ్వ మృతి చెందడంతో శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వీరి వెంట ఎల్లారెడ్డి మాజీ జడ్పీటీసీ సామేల్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ సుఖేందర్‌రెడ్డి, మహేందర్, పోశెట్టి, సత్యనారాయణ, మాసానిపల్లి మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి తదితరులున్నారు.

రైతులతో నాయకుల చర్చ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలోని వ్యవసాయ రోడ్లతో పాటు గ్రామంలోని రోడ్ల మరమ్మతులపై గ్రామంలోని కాంగ్రెస్ నాయకులతో పాటు మండల నాయకులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించారు. గ్రామంలో మట్టి రోడ్లతో పాటు సీసీ డ్రైనేజీ పనులను వారు పరిశీలించారు. వీటన్నింటినీ మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి గ్రామంలోని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబీన్‌ఖాన్ స్పష్టం చేశారు. ఆయన వెంట మండల నాయకులు సాయిరెడ్డి, ఆగంటి సురేందర్‌గౌడ్, ఎమ్మెల్ రాజు, గంగాకృష్ణ, గ్రామ అధ్యక్షులు సొక్కుల సాయిలు, గోసుల గంగాకిషన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఉప వైద్యాధికారి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం బోధన్ ఉప వైద్యాధికారి డా.సమత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశావర్కర్ల పనితీరు, వైద్య సిబ్బంది పనితీరుపై పీహెచ్‌సీ వైద్యులు డా.రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఫార్మాసిస్టు రమణకుమార్, స్టాఫ్‌నర్సు అలివేలి మంగ, ఆయూష్ సిబ్బంది ఆస్మా, ఉన్నారు.

విధాన సభలో ప్రశ్నించే గొంతుకలుండాలి

నవతెలంగాణ-కామారెడ్డి

విధాన సభలో ప్రశ్నించే గొంతుకలుండాలని పార్లమెంటు సభ్యులు, జాతీయ ఓబీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యక్రమంలో టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల సమావేశాన్ని నిర్వహించారు. కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి హాజరైన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ ఓబీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి ఎమ్మెల్యేగా బీజేపీ పార్టీ అభ్యర్థి వెంకటరమణారెడ్డిని గెలిపించి చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని ఆలోచించి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పాల్గొని ఓటు వేయాలన్నారు.

ఆకాశవాణిలో కిసాన్ వాణి

- నేడు రేడియో కిసాన్ దివస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దేశానికి అన్నం పెట్టేది రైతులు. అలాంటి రైతుల సేవలో ఆకాశవాణి ఎన్నో వినూత్న కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేస్తోంది. విద్యార్థులు, యువకులు, మహిళలు, రైతులకు ఉపయోగపడేలా అనేక కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేస్తోంది. ఇల్లూ వాకిలి శీర్షికన రైతు కార్యక్రమాలను ప్రసారం చేస్తున్న ఆకాశవాణి 2015వ సంవత్సరం నుండి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సౌజన్యం కిసాన్ వాణి కార్యక్రమాల ప్రసారానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాలను ప్రారంభించిన ఫిబ్రవరి 15వ తేదీ రేడియో దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం కూడా ప్రతియేటా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. గత కొన్నేండ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదర్శ రైతులతో పాటు వారికి సేవలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలను గుర్తించి రేడియో కిసాన్ దినోత్సవం సందర్భంగా సత్కరిస్తోంది. అయితే రైతుల కోసం ఆకాశవాణి నిరంతరం కార్యక్రమాలను ప్రసారం చేస్తోందని ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం ముఖ్యకార్యక్రమాధికారి కె. రామేశ్వర్ తెలిపారు. రైతులకు సాగులో అవసరమైన మెళకులను, సాగు పద్ధతులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నామని వివరించారు. ప్రసార సమయంలో కార్యక్రమాలను వినలేని శ్రోతల సౌలభ్యం కోసం ఈ కార్యక్రమాలను ఆకాశవాణి యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతుల కోసం ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ప్రసారం చేస్తున్న కిసాన్ వాణి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ప్రతి ఒక్కరు ఆధార్ కార్డును కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ ప్రాంతీయ ఆధార్ కార్యాలయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆధార్ కేంద్రాలలో సులువుగా ఆధార్ నమోదు, పేరు, చిరునామ ఇతర వివరాలు మార్పులు, చేర్పులు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురిలో గల ప్రధాన తపాలా కార్యాలయంలో పూర్తిస్థాయి ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధార్ సేవలలో సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులలో ఆధార్ సేవా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు, ఆస్పత్రుల్లో శిశువులు జన్మించిన వెంటనే వారి తల్లిదండ్రుల నుంచి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకొని శిశువులకు తగు ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు కలిగి ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆధార్ కార్డులలో మార్పులు చేర్పులకు సంబంధించి సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. త్వరలోనే ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, ఆధార్ కార్డులలో తప్పుగా ముద్రించబడిన వివరాలను సరిచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పాఠశాలలను విద్యార్థుల ఆధార్ కార్డులలో తప్పులు ఉన్నట్లుగా గుర్తిస్తే వాటిని సరి చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఈఓ రామారావు, పోస్ట్ మాస్టర్ వెంకటరావు, డీటీడీఓ అంబాజీ, సీడీపీఓ నాగలక్ష్మి, ఎల్‌డీఎం రామ్ గోపాల్, అధికారులున్నారు.

పార్టీలతో పని లేదు.. ప్రజలతోనే ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ-కౌటాల



పార్టీలతో పనిలేదని ప్రజలతోనే ఎల్లప్పుడూ ఉంటానని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని వీరదండి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నేను ఏ నిర్ణయం తీసుకున్న సమిష్టి ప్రజల నా కార్యకర్తల అభిప్రాయం మేరకే తీసుకుంటానని అన్నారు. నాకు కేసీఆర్ ఎలాంటి అన్యాయం చేయలేదని నన్ను ఓడించడానికి పనిగట్టుకొని వచ్చిన వ్యక్తి బీఆర్ఎస్‌లోకి వెళ్లడంతో నేను అందులో నుండి బయటికి వచ్చానని కార్యకర్తలకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరి గుండాయిపేట వార్ధ నదిపై వంతెన నిర్మాణం కోసం సీఎం రేవంత్ రెడ్డి కోరగా హామీ ఇచ్చారని, ప్రస్తుతం దానిని క్యాన్సల్ చేశారన్నారు. అందుకే పార్టీల కతీతంగా ఉంటానని ఏ పార్టీతో సంబంధం లేకుండా ప్రజల నిర్ణయంతో ముందుకెళ్తానన్నారు. గతంలో నా కింద ఉన్న కొంతమంది వ్యక్తుల వల్ల ప్రజలు నన్ను ఓడించారని కానీ ఇప్పుడు ఆ ప్రజలే తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా ఏ నిర్ణయం తీసుకున్న కార్యకర్తల అభిప్రాయం మేరకే నా నిర్ణయం ఉంటుందని ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ కుమ్రం మాంతయ్య, అదే వసంతరావు, బొమ్మ కంటిమనీ, నాజీం హుస్సేన్ ఉన్నారు.

వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులందరికీ నాణ్యమైన చదువుతో పాటు మెరుగైన వసతులను కల్పించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఇంద్రానగర్‌లో గల ప్రభుత్వ వెనకబడిన తరగతుల బాలుర కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, రీడింగ్ రూమ్ పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ నిర్వహణకు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులందరికీ స్వయంగా భోజనాన్ని వడ్డించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి వారితో ముచ్చటిస్తూ బాగోగులను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థుల చదువుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఖచ్చితమైన సమయపాలన పాటిస్తూ చక్కగా చదువుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి డి.శ్రీనివాస్, సహాయ వెనుకబడిన తరగతుల అధికారి కె. సత్యనారాయణ రెడ్డి, వసతిగృహ వార్డెన్ యోగేశ్వర్, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలల అభివృద్ధి పనులు. వేగవంతం చేయాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాఠశాలల అభివృద్ధి కొరకు పీఎంశ్రీ కింద మంజూరైన నిధులు సద్వినియోగం చేసుకొని పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం విద్యా శాఖ సెక్రటరి సమగ్ర శిక్ష , పీఎం ఫండ్స్ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ను సందర్శించారు. కిచెన్ షెడ్, డార్మెటరీ, డైనింగ్ హాల్, తదితర వాటిని పరిశీలించి, పాఠశాలకు అవసరమైన మరమ్మత్తులు కొరకు అంచనాల నివేధిక సమర్పించాలని, ఇన్ కంప్లీట్ బిల్డింగ్ వివరాలను ప్రిన్సిపల్ లలితకుమారిని ఆదేశించారు. పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన 24 పాఠశాలలకు మంజూరైన నిధులను పాఠశాలల్లో వివిధ వసతుల కల్పన కు సత్వరమే వినియోగించాలని పాఠశాలల్లో తరగతి గదులు, కిచెన్ గార్డెన్, ఫీల్డ్ విజిట్, ఎల్ ఈ డీ లైటింగ్, తదితర పలురకాల పనులకు వినియోగించుకోవాలని సూచించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో పీఎం శ్రీ పథకం నిధుల వినియోగం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి పై విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకొని పీఎంశ్రీ పాఠశాలల్లో కేటాయించిన నిధులను సకాలంలో వినియోగించాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ ప్రత్యేక తరగతులను, అభ్యాస దీపిక లను వినియోగించుకొని, సబ్జెక్టుల వారీగా తెలియని విషయాలు తెలుసుకోవాలన్నారు. బాగా చదువుకొని పదిలో మంచి ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ అభిగ్యన్ మాలవియా ఉన్నారు.

క్రైస్తవ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



నవతెలంగాణ-కడెం

క్రైస్తవ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని శుక్రవారం మండల కేంద్రంలోని క్రైస్తవులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల కేంద్రం శివారులో గల సర్వేనెంబర్ 35లో ఉన్న రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని క్రైస్తవ శ్మశాన వాటికకు కేటాయించాలని వారు కోరారు. ఇప్పటివరకు ఎలాంటి స్థలం కేటాయించక పోవడంతో మండల క్రైస్తవులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా తమ క్రైస్తవ సమాజానికి శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల కేంద్రానికి చెందిన క్రైస్తవులు పాల్ కరుణాకర్, పిలిప్, సామ్యుల్, జోసఫ్, సైమన్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జానకంపేట్, ఎడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం అధిక లోడుతో బోధన్ నుంచి నిజామాబాద్ వైపు అధిక లోడ్‌తో వెళ్తున్న రెండు ఇసుక టిప్పర్లను అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పట్టుకున్నారు. జానకంపేట్‌లో పట్టుకున్న ఇసుక టిప్పర్‌ను ఆరవ టౌన్‌కు తరలించగా, ఎడపల్లి మండల కేంద్రంలో పట్టుకున్న ఇసుక టిప్పర్‌ను ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు ఇసుక టిప్పర్‌లకు వేబిల్లు ఉన్నప్పటికీ పరిమితికి మించి లోడుతో వెళుతున్న టిప్పర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

కస్తూర్బాను సందర్శించిన తహసీల్దార్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తహసీల్దార్ శ్రావణ్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకురాలు శ్యామలకు సూచించారు. విద్యార్థులకు అందించే బియ్యం నిల్వలు, స్టాకు నిలువలను ఆయన పరిశీలించారు. కోడిగుడ్లను శుభ్రమైన స్థలాల్లో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా జాగ్రత్తగా తీసుకోవాలని ఆయన అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన సూచించారు. వంటలు చేసే సమయంలో వంట సామగ్రి శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ రవికుమార్, పాఠశాల ప్రత్యేక అధికారిని శ్యామల, ఉపాధ్యాయులు శిల్ప, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 18న మండల స్థాయి క్విజ్ పోటీలు

నవతెలంగాణ-బోధన్

ఈ నెల 18వ తేదీన బోధన్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈఓ కార్యాలయం హాల్‌లో మండల స్థాయి క్విజ్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున బోధన్, సాలూర మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి అన్ని మీడియంల నుంచి కేవలం ఐదుగురు విద్యార్థులతో కూడిన ఒక జట్టుకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. పోటీలలో కేవలం పదవ తరగతికి సంబంధించిన అన్ని సబ్జెక్టులతో పాటు జీ.కే, క్రీడలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారి పాఠశాలకు బోధన్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. పోటీలు బోధన్ మండల విద్యాశాఖ సహకారంతో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కావున బోధన్, సాలుర మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. 17వ తేదీ వరకు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ముత్యాల నగేష్ ఫోన్ 9010700210 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.